# ఏరోజు ఎల్లాంటిదో!

కాళ్లకూరి దయానిధిరావు

వెంకటసామి కులానికి చాకలి. ఐదాఱు సంవత్సరా లొకఉద్యోగియింట నెలజీతానికి పనిచేశాడు. వంచినవడుము వంచినట్లే ఉండేది; ఉతికినచేతు లుతికినట్లే ఉండేవి. కాని యెంతపనిచేసినా అతనికి మాట తక్కేదికాదు. యజమాని, యజమానురాలు మంచివారు కాదు. ఊపిరి సలుపకుండా పనిచెప్పేవారు.

'సామిగా, యింతసేపెక్కడ తగులడ్డావు? పిల్ల యేడుపు వినపడటములే?' అని ఒకసారి కేకవేసి యజమానురాలు తిట్టేది.

'వస్తున్నానమ్మా' అని సామి వెడుతూండగనే కొన్నివందలు తిట్లామె మొదలుపెట్టేది.

బజారుపనికికూడా యెప్పుడూ సామినే పంపేవారు. అతడు కొంచెము రావడ మాలస్యమైతే

'ఇంత ఆలస్యం యేమిటి? నీమొగాన్నేసి కొట్టుకో' యని వారు కసిరేవారు.

తిట్టినపుడు తిట్టినా పెట్టేటప్పుడాదరించి పెట్టేది కాదు యజమానురాలు. ఆమె కడుపిసినిగొట్టు. కుళ్ళితేనేకాని ఒకపండైనా వాడికిచ్చేదికాదు. పాడయితేనే కాని కూరా, కుమ్మా పనివాళ్లకు పెట్టడానికి ఆమెకు చేయి వచ్చేదికాదు.

'ఈతల్లి యెక్కడ పుట్టిందో. ఈఅమ్మను కనడానికి తలిదండ్రు లెన్నినోములు పట్టారో. దరిద్రకుటుంబంలో పుట్టింది కాబోలు. అంచేతే యీవిడకు పెట్టడానికి చేయిరాకపోవడం'అని పనివాళ్లు లోపల తిట్టుకొనేవాళ్లు.

ఇట్టివారిని కాసిపెట్టుకొని ఉండడము వెంకటసామికి విసుగుతోచింది. జీవితము పాడనిపించింది; రోజులు విచారంగా కనడబడేవి. 'సంతోషము లేకపోయాక డబ్బు ప్రధానమా? రెండురాళ్లు తక్కువ యిచ్చినా మంచివాళ్లకి సేవచేస్తే నయము'ని అతనికనిపించింది.

ఆనెలజీతం తీసికొని వెంకటసామి అచట పని మానుకొన్నాడు. ఊళ్లో ఐదారిళ్లు ఉతుక్కునేవాడు. భార్యకూడా కొన్నియిళ్లు చేసుకొనేది.

రోజూ కోడికూతతో లేవడము, అన్నంమూట కట్టుకొని భార్యతో చాకలిరేవుకు పోవడ మతనికి సంతోష మనిపించేది.

మిగిలిన చాకళ్లతో కలసి పనిచేయడం అతనికి హాయి అనిపించింది. కట్టినది గోచీఅయినా, చుట్టినది పాగాఅయినా తనకంటె సుఖపడేవాడు ప్రపంచములో యెవడూ లేడని తలచేవాడు. ఉడకపెట్టి ఉతికి బట్టలారవేసి పన్నెండు, ఒంటిగంటా అయేటప్పటికి ఒక జువ్విచెట్టునీడను చేరి భార్యతోపాటు కులాసాగా మాటలు చెప్పుకుంటూ ఆగంజీ అన్నము, ఉప్పు పంచభక్ష్య పరమాన్నాలుగా తినేవాడు; అదే అతనికి విందనిపించేది.

ఈవిధంగా చాలాయేళ్లు గడిచాయి; ఆతడు కొంచెండబ్బు నిలవవేశాడు. వాడికులానికి తాగేఅలవాటున్నా అతనికి యిష్టములేకో, మరేకారణముచేతో అతను తాగుడికి అలవాటుపడలేదు. అదీ అతనిఅదృష్టమేమో చెప్పలేను. కాని ప్రతిఆదివారం వాళ్లు మంచిచేప కొని కూరవండుకునేవారు. అతనిగుడిసెకూడా శుభ్రంగా వుండేది. ఒక పాతకుర్చీకూడా యెల్లా సంపాదించాడో కాని వాళ్లయింట్లో వుండేది. పిల్లల నెవరినీ దానిమీద కూర్చోనిచ్చేవాడు కాడు. ఎపుడైనా సరదా పుటితే తనే కూర్చునేవాడు; తనకోసం యెవరైనా వస్తే కూర్చోమని ఆకుర్చీ చూపించేవాడు.

అతనిభార్య 'వీరి'కూడా యింటికి కళగా వుండేది. సిరికలకళ్లు, మోకాళ్లవరకూ పడేజుట్టు, చామన

చాయ మొగము, బుగ్గపై చిన్న నల్లటిపుట్టుమచ్చ-వీటితో వీరమ్మ యెప్పుడూ పెళ్లికూతురులా కనబడేది. ఆమెను చూచినవాళ్లందరు 'అందం యే శ్రమా, యే శ్రద్ధా తీసికోని బీదలసొమ్ము కాబోలు'నని అనుకొనేవారు.

మొత్తముమీద వాళ్లు కులంలో భాగ్యవంతులుగా వుండేవారు. సలహాలకీ, తగాలుతీర్చుకోడానికీ మిగిలిన వాళ్లందరూ వెంకటసామివద్దకు వచ్చేవారు. అతనిభార్య కూడా చాకలిచానల నందరినీ చేరదీసేది, సరదాగా కబుర్లు చెప్పేది.

కాని దేవుడు వాళ్లకు రోజులు సుఖంగా వెళ్లనిచ్చాడు కాడు. వెంకటసామికి పక్షపాతం వచ్చి మంచం యెక్కాడు. ఒకకాలూ, ఒకచెయ్యా పడిపోయాయి.

డాక్టర్లచేత మందు లిప్పించారు. చివరికి చేయి వచ్చింది. కఱ్ఱతో కుంటుతూ యింట్లో నడిచేవాడు వెంకటసామి. అతనికి దారుఢ్యం చేరేటప్పటికి అతనియింటి పరిస్థితులు అద్దాన్నం అయాయి. బీదవాడనియైనా కనికరం లేకుండా డాక్టరు జోరుగా బిల్లుచేసాడు. బిల్లు తీర్చేటప్పటికి తలప్రాణం తోకకు వచ్చింది. నిలవ వేసుకొన్న డబ్బంతా అయిపోయింది.

ఇంతకాలమూ కుటుంబానికి 'వీరే'గతి. ఆడది యెంతమందికని ఉతకకలదు? చాలాయిళ్లు మానుకుంది. బట్టలాలస్యంగా అందించేది. బట్టలువేసే వాళ్లుకూడా బట్టలు వెయ్యమని వీరిని జడిపించేవారు.

'చాకలి యిల్లా పడిపోయాడు. మీరు మానక పోతే యింకెవరు దిక్కు?' అని యేడిస్తే వాళ్లు దాని చేతే ఉతికించుకొనేవారు. వీరి యీవిధంగా నానా తిప్పలూపడేది. ఈడుకు వచ్చిన కొడుకేనా లేడని వీరీ, వెంకటసామీ కష్టకాలంలో అనుకొనేవారు.

వీరమ్మ చేసే ఉపచారంవల్ల, ఉపశమనపు మాటల వల్ల వెంకటసామి తిరిగి మామూలు మనిషి అయాడు.

'వీరీ! నీరోజు బాగుంటే, నువ్వు వచ్చినవేళ మంచిదయితే నిన్ను సుఖపెడతా'నని వీరిని ప్రేమతో నిమురుతూ అనేవాడు సామి. తిరిగి యేం చేద్దామా అని సామికి తలపులు మొదలుపెట్టాయి. ఏమీ పాలుపోయిందికాదు. ఇంటింటా తిరిగి బట్టలుతికిన లాభం లేదని అతనికి తోచింది. తను వున్న పట్టణములోనే 'లాండ్రీ' పెడదామని అతనికి బుద్ధిపుట్టింది. పెళ్లాంవంటిని కొద్ది బంగారం వుంటే దానిని అమ్మేశాడు. ఆడబ్బు తీసికొని మంచిబల్లలూ, అద్దాలూ కొన్నాడు. పట్టణపు మూలలో ఒకచిన్నకొట్టు అద్దెకు తీసికొన్నాడు. అచటనే రాత్రియనక, పగలనక పట్టుదలతో పనిచేశాడు. మంచి పేరు తెచ్చుకొన్నాడు. ఇప్పుడందరూ బట్టలు సామికే వేసేవారు. వీరి బట్టలుతికి తేవడము; తాను ఇస్త్రీ చేయడం.

కొంతకాలానికి పనిరద్దీ యెక్కువయిపోయింది. ఇద్దరు, ముగ్గురు పనివాళ్లని చేతికింద పెట్టుకున్నాడు; రెండు, మూడు యిస్త్రీపెట్టెలు ఎక్కువ కొన్నాడు. పనివాళ్లు మూటలు మోయడము ఆలస్యం, ప్రయాసా అనిబట్టలు మోయడానికి రెండెద్దుబళ్లను కొన్నాడు.

స్వయముగా పనిచేయవలసిన రోజులు వెంకటసామికి తప్పాయి. ఇప్పుడజమాయిషీపనే. లాండ్రీషాపు బిల్లులూ, అక్కౌంటులూ చూచుకొనేవాడు; డబ్బుకోసం యింటింటా తిరిగేవాడు. నెమ్మదివల్లా, శాంతంవల్లా అతడు కొన్నివేలు సంపాదించాడు; కొంతమందిని పోషించగలిగాడు. గర్వ మతనిని గుడ్డివాణ్ని చేయలేదు. తన పూర్వపు దౌర్భాగ్యపు రోజుల నతడు మరువలేదు. పెద్ద యిల్లొకటి ఆపట్టణంలోనే కొన్నాడు. యజమానురాలనీ, యింటిపెత్తనం చెయ్యవచ్చనీ వీరి మహాకులికేది.

౨

అప్పుడే సాయంత్రం అవుతోంది. ఇస్త్రీబట్టలిచ్చిరావడానికి సామి పనివాళ్లని ఊళ్లోకి పంపించాడు. తీరుబడిగా కూర్చొని యేదో ఆలోచిస్తున్నాడు.

ఆసమయమున సామిదృష్టి లాండ్రీముందరనున్న ఒక వ్యక్తిమీద పడింది. పదినిముషాలనుంచి అతడక్కడే నిలబడియున్నాడు. కాని సామి అదే మొదటిసారి చూడడం అతన్ని.

అతనిని చూడడముతోనే సామిమనస్సు చివుక్కుమంది. అతనంటే జాలితోచింది. పాపం ఇంకో రంగు బట్టతో అతుకులు వేసి కుట్టిన చొక్కా; కంకరబూడిదతో

ఎర్రగా తోలయివున్న పంచి. కష్టముల గాయపు మచ్చలు పడిన అతని ముఖమును కప్పివుచ్చుటకా అన్నట్లు జుట్టు మొగంమీద పడుతోంది. నేరస్థుడివలె అతడు వెంకటసామి ముందర నిలబడ్డాడు.

'ఏం, యిలా వచ్చావు?. ఎవరవు నీ' వని సామి అతన్ని ప్రశ్నించాడు.

అతడు పెదవులనైనా విప్పలేదు. మాట్లాడాలని ఊహ ఉంది కాని మాటరావడం లేదు. కళ్లుమాత్రం బాష్పాలతో నిండిఉన్నాయి. సామి అతనికేసి ఏదేక దీక్షతో చూస్తున్నాడు.

'రెండు మూడు రోజులనుంచి తిండిలేక యీ విధంగా మాడుతున్నాను. నన్ను పోషించుకోవడం నాకే భార మనిపించింది. అయినవాళ్ల, కానివాళ్ల కడుపూ కాళ్లూ పట్టుకొన్నాను. ఇంత చాకిరీ చేస్తాను. బట్టా తిండీ పెట్టి పోషించరా? అని అడిగాను. కసిరారు. పోపో అన్నారు.

'జీవితమంటే నాకు విసుగనిపించింది. బతికుంటే కష్టాలు పడడమేకదా. చచ్చిపోతే మే లనిపించింది. పాడు ప్రాణాలపై తీపిచేత నే నిల్లా తిరుగుతున్నాను. ఎంచేతోకాని దేవుడు నాకాళ్ల నిక్కడికి లాక్కొచ్చాడు'

అని చెపుతూ చెపుతూ ఆగిపోయి కొత్తమనిషి పెదవులు చిట్లించాడు.

అతను చెప్పేది సామికి నిజ మనిపించింది. ఇంటికి తీసికెళ్లి తిండిపెట్టించాడు. కొంచెం ప్రాణాలు చేరుకొన్నతరువాత సామి యతనివిషయం అడిగాడు. ఆగంతకుడు తన విషాదచరిత్రాన్ని చెప్ప మొదలు పెట్టాడు.

3

"నా పేరు సూరయ్య. నేనూ, యిదివరకు బాగా వెలిగినవాడిని. నాకు కొద్దో, గొప్పో పొలము, రెండు వేల రొక్కము వుండేవి. తిండికి లోటుండేదికాదు. హాయిగా రోజులు గడిపేవాడిని.

"ఇల్లా వుండగా నాకు పక్కనున్న ఊరు వెళ్లడం తటస్థించింది. ఒకపనిమీద ఆఊరు వెళ్లాను. ఒకవారం అచ్చటనే ఉండవలసివచ్చింది. ఆవారం ఒకయింట్లో మకాము చేశాను.

"ఆయింటి ఆమెకు ఒకకూతు రుండేది. వితంతువు. మంచివయస్సులో వుండేది. ఆమె బొట్టుపెట్టుకుంటే యింకా యెంత బాగుంటుందో యని అనిపించేది. ఆమె యంత యందకత్తె కాదు. ఆమె చిఱునగవుకే నేనామెను ప్రేమించాను. నన్ను నేను మఱచిపోయేవాడిని. ఆమె నవ్వేటప్పుడామె మొగమంతా లేయెండలో ప్రకృతివలె హాయిగా కనబడేది.

"ఆమెను చూచినప్పటినుంచీ నామనసు తిప్పుకోలేకపోయా. ఆమెకోసం నేను చాలా ప్రయత్నించేశా. వాళ్ళకుటుంబమూ అంత పేరుప్రతిష్ఠలు కలదికాదు. అది నాకు తరవాత తరవాత తెలిసింది. చివరకు నాకామె లభించింది.

"ఏకో ఒకవంకమీద వారానికి రెండుమూడు సారులైనా నే నాగ్రామం పోయేవాడిని. నాకింటిదగ్గర తోచేదికాదు. మా ఆవిడమొగం చూడడమంటేనే నాకు విసుగ్గా ఉండేది.

"ఆమాయలాడి వలపులకు మోసపోయి ఆమెకోరినదంతా యిచ్చాను. నాడబ్బు తగలబెట్టుకున్నాను. నాభూములు పోయాయి. ఇంట్లో అందరికీ నేనంటే కోపంగాఉండేది. అందరూ నన్ను చూచి అసహ్యించుకునేవారు.

"ఒకరోజున నే నొంటరిగా కూర్చొని యేదో ఆలోచిస్తున్నాను. ఎంచేతో చెప్పలేనుకాని నాకారోజున వైరాగ్యంతోచింది. జ్ఞానోదయం అయినట్టు నా కనిపించింది. వేదాంతమార్గంగా తలపులు మొదలుపెట్టాయి. అప్పటినుంచీ నా కావూరన్నా, ఆయువతన్నా విసుగుపుట్టాయి. మళ్లీ ఆగ్రామం తొక్కి చూడలేదు. ఆయువతి పేరు తలవలేదు.

"కాని యేం లాభం! చేతులు కాలింతరవాత ఆకులుపట్టుకోడం అయింది. ఒక నచ్చినస్త్రీని భార్యగా చేసుకొని ఆమెతో రోజులు గడపడము ఉత్తమ మనిపించింది.

"అప్పటికి నా కింకా రెండెకరాల మల్లితోట వుంది. అదేనా మా ఊరు కాని ఊర. మా ఆవిడిని

వెంటబెట్టుకొని ఆవూరు వెళ్లాను. ఆతోటలోనే ఒక గుడిసె వేసుకుని కాపరంచేసేవాళ్లం. మాసంసారానికి కావలసిన కూరా, నారా అక్కడే పండించుకొనేవాళ్లం.

"నేను తోటలో స్వయంగా పనిచేసేవాడిని. 'ఆనాడు సుఖపడ్డాడు. ఈ రోజు కష్టపడుతున్నాడు. ముందరరోజు తెలిసిఉండద్దా మరి' యని నన్ను బంధువులూ తిట్టేవారు.

"నా కీజీవితం అట్టే అంతకష్ట మనిపించలేదు. కాని మా ఆవిడ యీ కొత్తజీవితానికి అలవాటుపడలేక పోయింది.

"పాపం అది యిల్లాంటి విదివఊకెలుగును కనక నా మతి. నానాటికి అది శల్యం అయిపోయింది. బెంగతో మంచంపట్టి అది నాప్రాణానికి ఉసూరుమంటూ చచ్చింది. చచ్చినతరువాత అది మహాసాధ్వి అని నాకు తెలిసింది. దానిసుగుణా లొక్కొక్కటే నాకు జ్ఞాపకం వచ్చాయి. బతికున్నంతవరకూ నోరు తెరిచి ఒకకష్టమైనా నాతో చెప్పలేదు. నే నెంత చెడుతోవ పట్టినా నన్ను మచ్చుకు పల్లెత్తుమాటైనా అనలేదు. మనసులో కుమిలేదేమో నాకు తెలియదు. ఇప్పుడు దాన్ని తలచుకుంటే నాకు యేడుపువస్తుంది. కాపరానికి వచ్చింతరవాత ఒకరోజైనా దానితో మనసిచ్చి మాట్లాడలేదు. సుఖపెట్టవలసిన యువతిని కష్టపెట్టాను. నిజంగా మహాపరాధం చేశాను. ఏశిక్షకేనా నేను పాత్రుడనే."

భార్యనుగురించి చెప్పింతరవాత సూరయ్య కొంతసేపటివరకూ మౌనంగా ఊరుకున్నాడు. కళ్లు చీకట్లు కమ్మాయి; భార్యలేని ప్రపంచకము అంధకారబంధురముగా కనబడింది. అనేకతలపులు పొడమినాయి. ఆమె జ్ఞాపకానికి రావడమే అతనికి పడరాని బాధ యనిపించింది.

"ఇంతకీ దేవుడనేవా డొక్కడున్నాడు కాని లేకపోతే యేముంది? అది బతికుంటే యేమి సుఖపడేది? అడుక్కుతినడానికి చిప్పఅయినా ఒకటి లేదుకదా"

అని చివర కతనికి గోచరించింది. నిరాశతో పెదవులు విరిచాడు, చేతివేళ్లు తిప్పాడు.

సామి అతనికేసి యింతవరకూ చూస్తూనేవున్నాడు. 'పాడులోకంలో పుట్టినవాళ్లు యింత బాధాపడాలి కదా' అని అనుకున్నాడు. తను కష్టపడినరోజులు సామికీ తలపుకి వచ్చాయి.

తిరిగి సూరయ్య తనవృత్తాంతం మొదలెట్టాడు.

"అది చచ్చిపోయిన తరవాత నామల్లితోటకూడా పోయింది. మా అన్నదమ్ములు అన్యాయంచేసి అది నాదగ్గర లాక్కొన్నారు. అందుచేత యిల్లా వీథులు పట్టవలసివచ్చింది. ఒకరోజు అన్నముండి ఒకరోజు లేక యిల్లా రోజూ కటకటపడవలసివచ్చింది. నిద్రపోవడానికి సత్రపు అరుగులే గతయాయి. ఇల్లా మతిపోయి తిరుగుతున్నాను. 'రా' యని పిలిచే పుణ్యాత్ము డొక్కడూ నాకు కనబడలేదు. దేవుడు మీలో వుంటే మీరేనా నామీద దయతలుస్తారు. తిండీ, బట్టా చాలు. లాండ్రీలో పనిచేస్తూ వుంటా"

అని సూరయ్య సామితో దీనంగా చెప్పాడు.

సామీ ఒప్పుకున్నాడు. అతనికి చల్లటిమాటలు చెప్పాడు.

'నాయనా! దిగులుపడకు. నే నిదివరకు పడరాని కష్టాలు పడ్డాను. ఆఖరురోజుల్లో సుఖపడుతున్నాను. నా అసలుస్థితిని నేను మరిచిపోను. ఇప్పటిలానే యుంటానని యేమి నిశ్చయం? ఇంతకూ పదిమందికి పెట్టేవాడిది జన్మ; పదిమందిని పోషించేవాడిది రోజు. ఏ రోజు యెల్లాంటిదో—రా! నాయనా!'

అని అతన్ని చేరదీశాడు సామి.

అప్పటినుంచీ సూరయ్య ఆ లాండ్రీలోనే వుండేవాడు. లాండ్రీబాగుకే అతడు తన శక్తిని ధారపోశాడు. వీరమ్మా, సామీ అతన్ని కొడుకుగా చూచుకొనేవారు. సంతానంలేనివాళ్లకు దేవుడు అతన్ని పంపినట్లుగా వాళ్లు తలచేవారు. సూరయ్య వాళ్లయింట్లో ఒక డయ్యాడు. సూరయ్యే లాండ్రీపనంతా చూశేవాడు. సామి పెద్దతనంలో యింటిదగ్గరనుంచి కదలక్కర్లేకపోయింది. ఇంతకీ—

(*)